
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

మంగళవారం 5 నవంబరు 2024



సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ఎల్లారెడ్డిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సర్పంచుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జడ్పీటీసీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. సర్పంచుల జేఏసీ ఆధ్వర్యంలో 'చలో పోరుబాట'లో భాగంగా హైదరాబాద్ వెళ్తున్న తాజా, మాజీ సర్పంచులను పోలీసులు అరెస్ట్ అన్యాయమన్నారు. బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు నర్సింహారెడ్డి, నర్సింలు, సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సీసీఐ కేంద్రాల్లోనే పత్తిని విక్రయించాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- కొనుగోలు కేంద్రాల ప్రారంభం

8

పత్తిని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, కలెక్టర్



రాజన్న ఆలయంలో కార్తీక సందడి

- తరలివచ్చిన భక్తజనం
- కార్తీక దీపోత్సవం ప్రారంభం
- ఘనంగా మహాలింగార్చన

7

రాజన్న ఆలయ ఆవరణలో భక్తులు

న్యూస్ బాక్స్

రామాలయంలో ఎస్పీ పూజలు

గంభీరావుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేటలోని రామాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్ సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. రామాలయ విశిష్టత, ప్రాముఖ్యత తదితర వివరాలను తెలుసుకున్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ వెంట సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌గౌడ్, స్థానిక ఎస్సై శివకుమార్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

సిరిసిల్ల టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా స్థాయి యోగా పోటీలలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన యెలిగేటి భాను తేజ ప్రథమ స్థానంలో నిలిచాడు. సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న భానుతేజను సోమవారం ప్రధానోపాధ్యాయిని నాగుల భాగ్యరేఖ అభినందించారు. ఇటీవల ఎస్‌జీఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి యోగా పోటీలో భానుతేజ జిల్లా జట్టు నుంచి పాల్గొన్నాడు.

వేములవాడ టౌన్: రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడాపోటీలకు వేములవాడ మండలం చీర్లవంచకు చెందిన విద్యార్థి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని మేరీ స్వర్ణలత సోమవారం తెలిపారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం పోత్గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థి గుగులోతు సంపత్ రాష్ట్రస్థాయి అండర్ -17 అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 4వ తేదీన జరిగిన ఎస్‌జీఎఫ్ కరీంనగర్ జోనల్ స్థాయి లాంగ్ జంప్ విభాగంలో రెండో స్థానంలో నిలిచినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు శ్యాంసుందర్ తెలిపారు.

సర్వే షెడ్యూల్‌లో స్వల్పమార్పు





సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

- జిల్లాలో 50 వేల కుటుంబాల పెరుగుదల
- 9వ తేదీ నుంచి ఇంటింటి సర్వే
- జిల్లాలో ఇళ్ల జాబితా పూర్తి
- మరో మూడు రోజుల పరిశీలన
- జిల్లాలో 1.90 లక్షల కుటుంబాల గుర్తింపు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను పకడ్బందీగా నిర్వహించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేసింది. 6వ తేదీ నుంచి సమగ్ర సర్వే నిర్వహించాల్సి ఉంది. ఇప్పటికే ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు ఇళ్ల జాబితాను సిద్ధం చేశారు. ప్రతీఇంటికి స్టిక్కర్లు అంటించి కుటుంబాల వివరాలు సేకరించారు. 2011 గణన ప్రకారం చూసుకుంటే జిల్లాలో 50 వేల కుటుంబాలు అదనంగా పెరిగాయి. మరోసారి రివిజన్ చేసి ఎక్కడైనా కుటుంబాలు తప్పిపోతే నమోదు చేసుకోవడానికి 6, 7, 8, తేదీల్లో ప్రక్రియ చేపట్టే విధంగా ప్రణాళిక రూపొందించారు. అనంతరం 9వ తేదీ నుంచి ఎన్యూమరేటర్లు క్షేత్ర స్థాయిలో సర్వే మొదలు పెడతారు. 15 రోజులపాటు ప్రభుత్వం నిర్దేశించిన దాదాపు 56 అంశాలు 75 ప్రశ్నల సర్వే పత్రం ద్వారా వివరాలు సేకరిస్తారు.

జిల్లాలో పెరిగిన కుటుంబాలు

జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం 1,38,992 కుటుంబాలు ఉన్నాయి. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వేలో 1.90లక్షల కుటుం బాలు గుర్తించారు. మరో 10శాతం కూడా పెరిగే అవకాశాలు ఉన్నాయి. దీని ప్రకారం జిల్లాలో 51వేల వరకు కుటుంబాల పెరుగుదల కనిపించనుంది. 2014లో అప్పటి ప్రభుత్వం కుటుంబ సర్వే చేపట్టిన సమయంలో జిల్లాలో 1.77లక్షల కుటుంబాలను గుర్తించారు. జనాభాలో కూడా 2011లో 5.52 లక్షలు ఉంటే సమగ్ర సర్వేలో 5.68 లక్షలకు పెరిగింది. ఈసారి కుటుంబాల సంఖ్య పెరగడంతో సర్వే సమ గ్రంగా నిర్వహించాలని భావిస్తున్నారు.

ఇందుకోసం జిల్లాలో 150 కుటుంబాలకు ఒక ఎన్యూమరేటర్ వివరాలు సేకరించే 1380 మందిని నియమించారు. 140బ్లాక్‌లుగా విభజించి సూపర్ వైజర్లను నియమించారు. కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, అదనపుకలెక్టర్ ఖీమ్యానాయక్ సర్వేతీరును పర్యవేక్షిస్తున్నారు. జిల్లా ప్రణాళికశాఖ అధికారి శ్రీనివాసా చారి గణాంకాలను క్రోఢీకరిస్తున్నారు.

ప్రతీ ఇంటికి స్టిక్కర్

జిల్లాలో ఇంటింటి సర్వేలో భాగంగా ఎన్యూమరేటర్లు ప్రతీఇంటికి వెళ్లి ఒకఇంట్లో ఎన్ని కుటుంబాలు ఉన్నాయో? గుర్తిస్తున్నారు. యజమాని పేరు, ఇంటి పేరు, మున్సిపాలిటీ, లేదా మండలం, పేర్లతో స్టిక్కర్లను అతికించారు. 9వ తేదీ నుంచి సర్వేను మొదలు పెట్టనున్నారు.

తాజాగా టీచర్ల నియామకం

కుల గణనలో అనేక అంశాలు ఉండడంతో ప్రస్తుతం ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆర్పీలు ఇతరశాఖల అధికారులను

మిగతా 8లో

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) ర్యాగింగ్ చట్ట రీత్యా నేరమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణ పరిధిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో మహిళల రక్షణ, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఉత్తమ డాక్టర్లుగా ఎదిగి జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. సీనియర్లు, జూనియర్లు స్నేహపూర్వకంగా ఉండాలని, విద్యనభ్యసించి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని అన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడే వారి వివరాలను డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. మహిళలు, విద్యార్థినులు జిల్లా షీ టీమ్ నంబరు 8712656425కు సమస్యలపై ఫిర్యాదు చేయాలన్నారు. డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బొమ్మలతో పౌష్టికాహారంపై అవగాహన



డాక్టర్ కందేపీ రాణీప్రసాద్, తయారు చేసిన బొమ్మలు

సిరిసిల్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో పౌష్టికాహారంపై అవగాహన కల్పించే దిశగా ప్రముఖ బాలసాహితీవేత్త, అనువాదకురాలు డాక్టర్ కందేపీ రాణీప్రసాద్ కార్యక్రమాన్ని చేపట్టారు. సోమవారం సిరిసిల్లలోని సృజన్ ఆస్పత్రిలో పిల్లలతోపాటు తల్లులకు పోషకాహార పదార్థాలను ఆకర్షణీయంగా బొమ్మల రూపంలో చూపిస్తూ వాటిలో ఉండే పోషక విలువలను వివరించారు. చెర్రీ, బాదం, జీడిపప్పు, బెర్రీ, ఆపిల్, బత్తాయి, అరటి, సీతాఫలంతో బొమ్మలను తయారు చేసి ప్రదర్శించారు. రాణీప్రసాద్ సైన్స్‌ను పిల్లలకు అందించే దిశగా అనేక రచనలు చేశారు. పొడుపు కథల ద్వారా శరీర అవయవాలను పరిచయం చేశారు. తల్లులు, పిల్లలను చైతన్యవంతం చేసే దిశగా నూతనంగా పోషకాహారాన్ని బొమ్మల రూపంలో ప్రదర్శించారు.

పక్షవాతంతో బాధపడుతున్నాం.. పింఛన్ ఇప్పించండి

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ మండలానికి చెందిన తాము గత సంవత్సరాల నుంచి పక్షవాతంతో బాధపడుతున్నామని, తమకు దివ్యాంగుల పింఛన్ ఇప్పించి ఆదుకోవాలని సోమవారం పక్షవాత బాధితులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టగా విషయం తెలుసుకున్న జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం అక్కడికి చేరుకొని వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు.

విద్యార్థులకు అభినందనలు

తంగళ్లపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అటల్ బిహారీ వాజ్‌పేయ్ ఇన్‌స్టిట్యూట్ హిమాచల్ ప్రదేశ్‌లో పది రోజులపాటు నిర్వహించిన సాహస శిబిరం ముగించుకొని వచ్చిన తంగళ్లపల్లి మండల కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులను శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఉమేష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మనోహర్ సోమవారం అభినందించారు. శిబిరానికి కళాశాలకు చెందిన సంధ్య, సరిత ఎంపికయ్యారు. పది రోజులపాటు శిక్షణ తీసుకున్నారు.

కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : హమాలీ కార్మికులను శ్రమ దోపీడికి గురిచేస్తున్న కాంట్రాక్టర్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జవేణి, నాయకులు సోమనాగరాజు, బచ్చుపల్లి శంకర్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లోని జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో సోమవారం జిల్లా మేనేజర్ రజితకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఐకేపీ, సింగిల్ విండోల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీలను హమాలీలు లోడ్ చేసి తాడు కడితే టన్నుకు ప్రభుత్వమే నేరుగా హమాలీ కార్మికులకు రూ.40 చెల్లించేదని ప్రస్తుతం ఆ స్థానంలో కాంట్రాక్టర్‌లు ఇప్పటివరకు హమాలీ కార్మికులకు ఎటువంటి తాడు మాములు ఇవ్వడంలేదని అన్నారు. నాయకులు బట్టు రాయమల్లు, దేవేందర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలతో పల్లెల ప్రగతి



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న సభ్యులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలతో పల్లెల ప్రగతి సాధించాలని జాతీయ స్థాయి పర్యవేక్షణ బృందం ప్రతినిధి సునీల్‌కుమార్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటలో చేపట్టిన కేంద్ర ప్రభుత్వ పథకాల పనుల ప్రగతిని స్థానిక అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. గ్రామంలో చేపట్టిన పల్లె ప్రకృతి వనం, ఇంకుడు గుంతలు, ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. సభ్యులు స్నేహానజీబ్, ఏపీడీ నర్సింలు, డీపీఎం సుధారాణి, ఎంపీవో రాజు, ఏపీవో కొమురయ్య, ఏపీఎం మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండలం కంచర్లలో చేపట్టిన పనులను కేంద్రం బృందం క్షేత్రస్థాయిల పరిశీలించింది. ఏపీడీ నర్సింహాలు, ఐకేపీ డీపీఎం సుధారాణి, ఎంపీడీవో రఘురాం పాల్గొన్నారు.

గత ప్రభుత్వ సర్వే నివేదిక బయట పెట్టండి

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

బోయినపల్లి,నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ సమగ్ర కుటుంబ సర్వే నివేదికకు బయట పెట్టాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం వర్దవెల్లి గ్రామం మిడ్‌మానేరు ప్రాజక్టు బ్యాక్‌వాటర్‌లో ముంపునకు గురైంది. అక్కడ గుట్టపై ఉన్న దత్తాత్రేయ స్వామి ఆలయానికి వెళ్లి నిత్యపూజలు, జయంత్యుత్సవాలు నిర్వహించేందుకు బండి సంజయ్ బోటు సౌకర్యం కల్పించారు. సోమవారం బోటు ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే నివేదిక ఏమైందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు బయటపెట్టడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమగ్ర కుటుంబ సర్వేలో పేర్లు లేకపోతే తెలంగాణవారే కాకుండా పోతారని బెదిరిస్తే అమెరికా, లండన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లో ఉన్న తెలంగాణ వాసులంతా ఉన్నఫళంగా రాష్ట్రానికి వచ్చారని, సర్వే వివరాలను అందించాలని అన్నారు. సర్వేలో కుటుంబం, మతం, ఆదాయం, ఆస్తుల వివరాలు నమోదు చేశారని, ఎన్నేళ్లు ఉన్నా కులమైతే మారదు కదా? మళ్లీ కులగణన పేరుతో హడావుడి ఎందుకని అన్నారు. అసలు సమగ్ర కుటుంబ సర్వే నివేదికను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందకు బయటపెట్టడంలేదో సమాధానం చెప్పాలని, కుటుంబ సర్వే నివేదిక పేరుతో వందల కోట్ల ప్రభుత్వ ధనాన్ని వృథా చేశారని అన్నారు. కాంగ్రెస్‌కు దమ్ముంటే కేసీఆర్ కుటుంబం నుంచి ఆ మొత్తాన్ని రికవరీ చేయాలని సవాల్ చేశారు. మరోవైపు ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, బీజేపీ నాయకులు లింగంపల్లి శంకర్ ఎర్రం మహేష్, అల్లాడి రమేష్, గుడి రవీందర్ రెడ్డి, ఊదారి నరసింహ చారి, ఏనుగుల తిరుపతి, మోహన్,ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.



బోటు వద్ద పూజలు చేస్తున్న బండి సంజయ్

పనులు చేయించుకొని బిల్లులు చెల్లించని బీఆర్ఎస్

ఎల్లారెడ్డిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయించుకొని సర్పంచులకు బిల్లులు చెల్లించుకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని, సర్పంచుల పక్షాన మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు అధికారంలో ఉన్నప్పుడు ఈ ప్రేమ ఏమైందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి గృహ ప్రవేశ కార్యక్రమానికి సోమవారం హాజరయ్యారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సర్పంచుల బాధలు తెలిసిన ప్రభుత్వం తమదని, బిల్లులు చెల్లించేందుకు కొంత సమయం పడుతుందని అన్నారు. జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సాహెబ్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

సిరిసిల్ల రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేటలో సిరిసిల్ల సింగ్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, వార్డు కౌన్సిలర్ పాతూరి రాజిరెడ్డి సోమవారం ప్రారంభించారు. బీఆర్ఎస్ వార్డు అధ్యక్షుడు వీరగోని శ్రీనివాస్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల కేంద్రంలో సిరిసిల్ల ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్, వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకట రమణారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్ సోమవారం ప్రారంభించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు

బాధితులకు సత్వర న్యాయం



తనిఖీ చేస్తున్న ఎస్పీ

గంభీరావుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా కృషి చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌ను సోమవారం తనిఖీ చేశారు. నమోదు అవుతున్న కేసుల వివిరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుల విషయంలో వెంటనే స్పందించాలని, విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అన్నారు. అధికారులు, సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వర్తించాలన్నారు. గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలని, విలేజ్ పోలీస్ అధికారులు గ్రామాలపై పూర్తి అవగాహన కల్గి ఉండాలన్నారు. రౌడి షీటర్లపై నిఘా పెట్టాలన్నారు. గంజాయి రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఏర్పాటు చేయాలన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చే అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించారు. ఈ ప్రజావాణిలో 122 దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలన్నారు. త్వరితగితన పరిష్కారం చూపాలని, అర్జీ దారులకు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వాలని అన్నారు. వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

- తంగళ్లపల్లి మండలం మండెపల్లిలో రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద మురికి కాలువలు నిర్మించాలని ఆ గ్రామానికి చెందిన బుస్సా లింగం, క్రిష్ణరెడ్డి, రమేష్, అబ్బాస్, రఘు, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను వినతి పత్రం అందజేశారు. మురికి కాలువలు లేకపోవడంతో నీరంతా సీసీ రోడ్డుపై నిలిచి భక్తులు ఇబ్బం దులు పడుతున్నారన్నారు.
- వేములవాడ అర్బన్ మండలంలోని చింతల్‌ఠాణా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో రేణుకా ఎల్లమ్మ ఆలయానికి పరిహారం రాకపోవడంతో మధ్యలోనే నిలిచిపోయిందని, పరిహారాన్ని అందించి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలని గ్రామంలోని గౌడ సంఘం నాయకులు జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతి పత్రాన్ని అందించారు. మిడ్‌మానేరు డ్యాంలో చింతల్‌ఠాణా ముంపునకు గురవగా ఎల్లమ్మ ఆలయానికి సంబంధించిన పరిహారం ఇంతవరకు అందలేదన్నారు. గౌడ సంఘం నాయకులు పర్శరాములు, ఎల్లయ్య, రాజు, రంగు రాజు, తిరుపతి, రాజు, రాములు, మహేష్, రమేష్‌లు కోరారు.
- తంగళ్లపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితం ఉపాధ్యాయుడి డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని, 10వ తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఎండీ హమీద్, నులుగండ శ్రీనివాస్, రమేష్, మహేందర్, రమేష్ మాట్లాడుతూ గణిత ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను బద్దెనపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు సర్దుబాటు చేయడంతో తమ పిల్లలకు గణితాన్ని బోధించే వారు లేకుండా పోయారన్నారు. 10 వతరగతి పరీక్షలు ముగిసే వరకు తిరిగి మా పాఠశాలకు పంపించాలని కోరారు.
- తంగళ్లపల్లి మండల కేంద్రం శివారులోని లక్ష్మీపూర్ రోడ్డులో ఉన్న సంద్ర వాగులో ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేసి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కోడి అంతయ్య వ్యవసాయం కోసం అక్రమంగా బావిని నిర్మించాడని, పరిశీలించి చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన గంగరాజు, గంగ మహేందర్, గంగ సరోజన, శోభ సోమవారం అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

న్యూస్ బాక్స్

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన శ్రావ్యశ్రీ

ఓదెల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనూర్ హైస్కూల్లో తొమ్మిదోతరగతి చదువుతున్న రేండ్ల శ్రావ్యశ్రీ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైంది. ఉమ్మడి జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన స్కూల్ ఆఫ్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్ పోటీల్లో శ్రావ్యశ్రీ షాట్ పుట్‌లో ఉత్తమప్రతిభను కనబరిచి ఉమ్మడి జిల్లాలో ద్వితీయ స్థాయిలో నిలిచింది. దీంతో అండర్17 విభాగంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించే అథ్లెటిక్ పోటీలకు ఎంపికైంది. ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థిని రాష్ట్రస్థాయిలో ఎంపిక అవ్వడం పట్ల పూర్వవిద్యార్థులు, ప్రధానోపాధ్యాయుడు యేసుదాసు, ఉపాధ్యాయులు, పీఈటీలు పోరెల్ల సదయ్య, తాండ్ర ప్రణయ్ విద్యార్థిని అభినందించారు.

అగ్నిప్రమాదం



ఇంట్లో చెలరేగుతున్న మంటలు

మెట్‌పల్లిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో ఓఇంట్లో సోమవారం సాయంత్రం ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించింది. పట్టణానికి చెందిన జల అనే వివాహిత ఇంట్లో దీపం పెట్టి బయటకి వెళ్లింది. కొద్ది సేపటికి మంటలు చెలరేగడంతో ఇంట్లో ఉన్న 10 వేల నగదు, ఒక బీరువా కాలి బూడిదైనట్లు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.





మహాబావి


- ఆసియా ఖండంలోనే అతిపెద్దది
- ఒక టీఎంసీ నిలువ సామర్థ్యం
- 92 మీటర్ల లోతు.. 56 మీటర్ల వ్యాసం

ఇల్లంతకుంట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం తిప్పాపూర్ గ్రామ సమీపంలో నిర్మించిన మహాబావి ఆసియా ఖండంలోనే అతిపెద్దదిగా గుర్తింపు పొందింది.

కాళేశ్వరం ప్రాజెక్టు లోని నాలుగో లింక్ ద్వారా 10వ ప్యాకేజీలో భాగంగా అనంతగిరి గ్రామ సమీపంలో అన్నపూర్ణ రిజర్వాయర్ నిర్మించారు. రిజర్వాయర్ నిర్మించే ప్రదేశం ఎత్తుగా ఉండడంతో నీటిని ఎత్తిపోయాలనే లక్ష్యంతో తిప్పాపూర్ సమీపంలో సర్జిపూల్ నిర్మాణ పనులు చేపట్టింది. 92 మీటర్ల లోతు, 56 మీటర్ల వ్యాసంతో మహాబావి నిర్మాణం ప్రారంభించారు. రికార్డు స్థాయిలో 13 నెలల్లో పూర్తి చేశారు. ప్రతీ రోజు ఒక టీఎంసీ నీటిని నిల్వ చేసే సామర్థ్యంతో నిర్మించారు. 3.4 కిలో మీటర్లు కాలువల ద్వారా, 7.6 కిలోమీటర్ల టన్నెల్ ద్వారా మిడ్ మానేరు నుంచి నీటిని తరలిస్తారు. సర్జిపూల్‌లోని నీటిని ఎత్తిపోయడానికి అండర్ పంప్‌హౌస్ నిర్మాణం చేపట్టారు. పంప్‌హౌస్‌లో నాలుగు భారీ పంపులను ఏర్పాటు చేశారు. ఒక్కో మోటారు రోజుకు 2,800 క్యూసెక్కుల నీటిని సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తుంటాయి.

పంపులు నడవడానికి అవసరమైన విద్యుత్ కోసం సమీపంలోనే 440 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టారు. అండర్ పంప్‌హౌస్‌లోకి తొలుత ఇతరులను ప్రవేశం లేకపోయినా ప్రస్తుతం పర్యాటకులను అనుమతిస్తున్నారు.







అన్నపూర్ణ రిజర్వాయర్, అండర్‌గ్రౌండ్ పంప్‌హౌస్

జాతీయస్థాయి కరాటే పోటీలకు 'ఖని' విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): డిసెంబరులో పంజాబ్ రాష్ట్రంలో జరగనున్న ఎస్‌జీఎఫ్‌ఐ జాతీయ స్థాయి కరాటే టోర్నమెంట్‌కు గోదావరిఖనికి చెందిన జపాన్ షిటోరియో కరాటే స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల సంగారెడ్డిలో జరిగిన 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో శ్రీవర్షిని, ఎం.ముక్తిశ్రీ, బి.సహస్ర, సృష్టి, పి.సహస్ర ప్రతిభ కనపర్చి బంగారు, కాంస్య పతకాలు సాధించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా జపాన్ షిటోరియో విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థును జపాన్ షిటోరియో కరాటే స్కూల్ ప్రెసిడెంట్ తగరపు శంకర్, కార్యదర్శి ఎం రమేష్, పెద్దపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్‌ఐ సెక్రటరీ కె శ్రీనివాస్, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్స్ శ్రీనివాస్, కె శ్రావణ్, నిదిష్‌కుమార్, రోహిత్‌కుమార్, సంజన, అభిజ్ఞ, శివశ్రీ, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ బానేష్‌రావు, స్పందన క్లబ్ సెక్రటరీ వీరవిహార్ అభినందించారు.



పతకాలతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయిన విద్యార్థులు

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు వీసీ అభినందన



శాతవాహన ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో వీసీ ఉమేష్ కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు (ఆంధ్రజ్యోతి) 4: హిమాచల్ ప్రదేశ్‌లో జాతీయ సాహస శిబిరంలో పది రోజుల శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించుకొని వచ్చిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ అభినందించారు. పదిమంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో పాటు ఎస్సారార్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పడాల తిరుపతిని వీసీతో పాటు రిజిస్ట్రార్ వరప్రసాద్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ మనోహర్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కంచు తిరుపతి, డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ స్వప్న, డాక్టర్ శ్రీనివాస్ యాదవ్, డాక్టర్ ఆడెపు శ్రీనివాస్, డాక్టర్ అర్జున్, డాక్టర్ వి రాజేశం, డాక్టర్ గోలి శ్రీనివాస్‌లు అభినందించారు.

బాలుడి కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్ట్

కరీంనగర్ క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో రెండున్నర సంవత్సరాల బాలుడిని కిడ్నాప్ చేసిన కేసులో నిందితుల కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం... గతనెల 27న కరీంనగర్, చాకలివాడలో నివాసముంటున్న షేక్ రేనా తన రెండున్నర సంవత్సరాల కుమారుడిని కిడ్నాప్ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను పట్టుకునేందుకు ఎస్‌ఐ రాజన్న, కానిస్టేబుల్స్ కుమార్, బషీర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పారు చేశారు. బాలుడి అచూకీ కోసం గాలించిన ప్రత్యేక టీం సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించారు. కరీంనగర్ చాకలివాడకు చెందిన దాసరి స్వరూప అలియాస్ సరోజ, మోతె కృష్ణ బాలుడిని తల్లి వద్ద నుంచి అపహరించారు. ఆ బాలుడిని సాధనవేణి అలియాస్ బొజ్జ లలియా అలియాస్ లత, సాధనవేణి రమేష్ దంపతులకు 50 వేల వేలుకు అమ్మారు. దర్యాప్తులో ఈ విషయాలను గుర్తించిన పోలీసులు నిందితులైన దాసరి స్వరూప అలియాస్ సరోజ, సాధనవేణి లలియా, రమేష్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్ విధించారు. మరో నిందితుడు మోతె కృష్ణ పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ కోటేశ్వర్

సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

కరీంనగర్ అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గాంధీభవన్‌లో ఈ నెల 20న నిర్వహించే కాంగ్రెస్ సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని సేవాదళ్ జిల్లా ఇన్‌చార్జి గుర్రం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. కరీంనగర్‌లోని డీసీసీ కార్యాలయంలో సేవాదళ్ జిల్లా కార్యకర్తల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలకు జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో సేవాదళ్ కరీంనగర్ నియోజకవర్గ అధ్యక్షులు కాసారపు ఎల్లయ్యగౌడ్, నగర అధ్యక్షుడు తిప్పారపు ఆంజనేయులు, వివిధ మండాలల అధ్యక్షులు, నాయకులు కుమారస్వామి, భద్రేశం, గర్రెపల్లి రవీందర్ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



వేంపేట శివారులో రేషన్ బియ్యంను పట్టుకున్న పోలీసులు

మెట్‌పల్లి రూరల్, నవంబరు, 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపేట గ్రామం నుంచి అక్రమంగా ఆటోలో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా సోమవారం రాత్రి సీఐ నిరంజన్‌రెడ్డి పట్టుకున్నారు. ప్రజలకు పంపిణీ చేసిన రేషన్ బియ్యాన్ని గ్రామంలో సేకరించిన వాటిని అక్రమంగా తరలిస్తునారని వచ్చిన సమాచారంతో ఎస్సై-2 రాజుతో కలిసి వేంపేట శివారులో వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానస్పదంగా నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలానికి వెళ్తున్న టీఎస్01యూసీ5721 నంబర్ గల ఆటోను ఆపి తనిఖీ చేశారు. వాహనంలో సుమారు 22కింటాళ్ల బియ్యాన్ని సంచుల్లో తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనంతో పాటు ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. నిర్మల్ జిల్లాకు చెందిన ఎండీ హైదర్ అను ఆటో డ్రైవర్ ఎలాంటి అనుమతులు లేకుండా బియ్యాన్ని ఖానాపూర్ మండలానికి తరలిస్తున్నట్టు ఒప్పుకున్నాడు. దీంతో రేషన్ బియ్యంతో పాటు వాహనం, ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. సీఐ అదేశాల మేరకు ఎస్సై చిరంజీవి కేసు నమోదు చేసుకుని స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయి అధికారులకు అప్పగిస్తామన్నారు. అనంతరం ఆటో డ్రైవర్‌పై చర్యల నిమిత్తం మెట్‌పల్లి కోర్టులో హాజరుపరుస్తామన్నారు.



పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు (ఫైల్)

నేడు నాగుల చవితి

కరీంనగర్ కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాగోపాసన, సర్పపూజ అనాదిగా వస్తున్న ఆచారం. నాగజాతి విష్ణువుకు తలగడగా, గొడుగుగా, ఆసనంగా, పాదుకలుగా, శివునకు అలంకారంగా, గణపతికి యజ్ఞోపవీతంగా ఉన్నట్లు పురాణ కథలున్నాయి. నాగులను కుండలినీ శక్తిగా భావించి ఆరాధిస్తారు. ఈ దిశలో కార్తీక శుక్ల చతుర్థి నాగులు ఆవిర్భవించిన నాగుల చవితిని మంగళవారం జరుపుకోనున్నారు. ఉపవాసాలు పాటిస్తూ పుట్టల్లో పాలు పోసి, పాలు, నెయ్యి కలిపిన నువ్వులు, బియ్యపు ముద్దలను నైవేద్యంగా పెడతారు. సర్పసూక్తం, అనంత నాగేంద్ర, సుబ్రహ్మణ్యేశ్వ రస్తుతులతో అభిషేక, అర్చనాదులు చేసి, పుట్టమట్టిని బంగారంగా భావించి తిలక ధారణ చేసుకుంటారు.

క్రైం కార్నర్

పురుగుల మందు తాగిన యువకుడి మృతి

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యా ల గ్రామానికి చెందిన పంది మధుకర్(30) అనే యువకుడు పురుగుల మందుతాగి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పంది మధుకర్ నిత్యం మద్యం తాగుతూ ఇంటికొచ్చి కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. మద్యం తాగవద్దని వారించిన అతడి భార్యతో గొడవపడ్డాడు. క్షణికావేశంలో అక్టోబరు 30న తన ఇంటిలో పురుగుల మందు తాగాడు. గమ నించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడు మధుకర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య..

ఇల్లందకుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూజునూర్ గ్రామానికి చెందిన దుండ్ర లత (38) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లత కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. చికిత్స తీసుకున్నా తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యు లు జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందు తూ సోమవారం మృతి చెందింది. లత భర్త కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజ కుమార్ తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు..

రామగిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగెపల్లి శ్మశాన వాటిక వద్ద ఆదివారం రాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి చిట్యాల సమ్మయ్య(45) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం చిట్యాలకు చెందిన సమ్మయ్య కొయ్యూరు నుంచి నాగెపల్లి గ్రామానికి తన బంధువుల ఇంటి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రామగిరి మండలం నాగెపల్లి శ్మశాన వాటిక వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో పెద్దపల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడు సమ్మయ్య భార్య చిట్యాల సుగుణ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రకుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ..

సిరిసిల్ల క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) సిరిసిల్ల పట్టణం జిల్లా ఆసుపత్రి మార్చురీ వద్ద 55ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సోమవారం ఆసుపత్రి సిబ్బంది చూసి పోలీసులకు సమాచారం అందించారు. చనిపోయిన వ్యక్తి నీలిరంగు షర్టు ధరించి ఉన్నాడు. ఎడమ చేతిపై పుట్టు మచ్చ కలిగి ఉన్నాడు. మృత దేహాన్ని మార్చురీ గదిలో భద్ర పరిచామని, సంబంధీకులు సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

తంగళ్లపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వేల్పుల సంజీవ్(27) అనే యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పది రోజుల క్రితం సంజీవ్ సిరిసిల్ల చెందిన రమేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై సిద్దిపేటకు వెళ్తున్నాడు. జిల్లెల్ల-రామచంద్రపూర్ గ్రామాల మధ్య ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. సంజీవ్ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు. రమేష్ పరిస్థితి సైతం విషమంగా ఉన్నట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో రైతుకు గాయాలు

ఇల్లంతకుంట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిక్కుడువాని పల్లె గ్రామానికి చెందిన బోయిని నరసయ్య (54) అనే రైతు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. చిక్కుడువాని పల్లెకు చెందిన నర్సయ్య ద్విచక్ర వాహనంపై పెద్దలింగాపూర్ గ్రామానికి వస్తున్నాడు. ఒక్కసారిగా వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. గాయాలవడంతో వెంటనే 108 వాహనంలో కరీంనగర్ ఆసుపత్రి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీ



బ్యాటరీ చోరీకి గురైన ట్రాక్టర్‌ను చూపుతున్న బాధితుడు

గన్నేరువరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండాపూర్, గుండ్లపల్లి గ్రామాల్లో తొమ్మిది ట్రాక్టర్ల బ్యాటరీలు, 18 ట్రాక్టర్ల హైడ్రాలిక్ పట్టీలను ఆదివారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్ల బ్యాటరీలను, హైడ్రాలిక్ పట్టీలను దొంగలించారు. సోమవారం ఉదయం ట్రాక్టర్లను స్టార్ట్ చేయడానికి ప్రయత్నించగా ఎంతకీ స్టార్ట్ కాకపోవడంతో ట్రాక్టర్‌ను పరిశీలించగా బ్యాటరీలు, హైడ్రాలిక్ పట్టీలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఒక్కో బ్యాటరీ ఖరీదు సుమారు ఎనిమిది వేలు, ఒక్కో హైడ్రాలిక్ పట్టి ఖరీదు రెడువేల రూపాయల వరకు ఉంటుందని బాధితులు వారి ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- అవయవదానం చేసిన తల్లిదండ్రులు



మాదాసి సాయి నితీష్ (ఫైల్)

కళ్యాణ్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కుమారుడి బ్రెయిన్ డెడ్ అయి పుటెడు దుఖంలో ఉన్న ఆ తల్లిదండ్రులు తమ కుమారుడి అవయవాలను జీవన్‌దాన్ ట్రస్ట్‌కు దానం చేశారు. అక్టో బరు 24న మాతంగి కాలనీవద్ద రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా, గోదావరిఖని రమేష్‌నగర్‌కు చెందిన మాదాసి సాయినితీష్ (23) తీవ్రంగా గాయపడ్డాడు. చావు బతుకుల మధ్య పోరాటం చేస్తూ సోమవారం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో మరణించాడు. నితీష్ తల్లిదండ్రులు గుండె, కాలేయం, కిడ్నీలు, కళ్లను జీవన్‌దాన్ ట్రస్ట్‌కు దానం చేయగా యశోద ఆసు పత్రిలోని సిబ్బంది నితీష్‌కు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మల్లేష్, ఉమ మాట్లాడుతూ తమ కుమారుడు బ్రెయిన్ డెడ్ అయి మృతి చెందినా అవయవదానం చేసి ఇతరులకు ప్రాణం పోశాడన్నారు.

- రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ మృతి చెందిన రమేష్ నగర్‌కు చెందిన మాదాసి సాయి నితీష్ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పరామర్శించారు. వారి తల్లిదండ్రులను ఓదార్చారు.



పసుపు వర్ణంలో చేతులు



బలపం రాళ్లు



రాశిగుట్టపై ఆంజనేయస్వామి దేవాలయం

రంగు మార్చే రాశిగుట్ట

అటవీప్రాంతంలో ఉన్న ఆ గుట్టకు ప్రత్యేకత ఉంది. గుట్టపైకి వెళ్లే సరికి చేతులు, కాళ్లు పసుపు వర్ణంలోకి మారిపోతాయి. గుట్టపై లెటరైట్ శిలలు ఉన్నాయని, అధిక ఉష్ణోగ్రతలు, అధిక వర్షపాతంతో ఆ ప్రాంతంలో ఇలా జరుగుతుందని పరిశోధనల్లో వెల్లడైంది. రాజన్నసిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామ శివారులో రాశిగుట్టకు సంబంధించి మరిన్ని విశేషాలు..

- **గుట్టపై లెటరైట్ శిలలు**
- **వాతావరణ మార్పులతో పుసుపు రంగు ధూళి**

వీర్నపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం కంచర్ల శివారులోని అటవీప్రాంతంలో రాశిగుట్ట ఉంది. ఈ కొండపైనే వెలిసిన అంజనేయస్వామి ఆలయంలో మొక్కులు చెల్లించుకోవడానికి భక్తులు వెళ్తుంటారు. గుట్టపైకి ఎక్కుతున్న క్రమంలో చేతులు, కాళ్లు పసుపు రంగులోకి మారి పోతుండడాన్ని భక్తులు గమనించారు. రాశిగుట్ట విషయం తెలుసుకున్న సంబంధిత అధికారులు, పరిశోధకుల బృందం ఇటీవల రాశిగుట్టను సందర్శించింది. బృందం వెల్లడించిన వివరాల ప్రకారం.. గుట్టపై భాగాన లెటరైట్ శిలలు ఉన్నాయి. అధిక ఉష్ణోగ్రతలు, అధిక వర్షాపాతం ఉన్న ప్రాం తాల్లో ఇవి ఏర్పడతాయి. ఈ శిలలు వాతావర ణానికి ఆక్సీకరణం చెంది గుల్లలు గుల్లలుగా స్పాంజి వలే తయారవుతాయి. జాజు, పసుపు రంగు లేదా నారింజ రంగును సంతరించుకుంటాయి. ఈ క్రమంలో గుట్టపై పసుపు రంగు ఉన్న ధూళి గాలిలోకి చెట్లపైనా, రాళ్లపైనా చేరుతుంది. భక్తులు వాటిని తాకిన సందర్భంలో చేతులకు, గుట్ట ఎక్కుతుండగా పాదాలు పసుపు వర్ణంలోకి మారుతున్నాయి.

వాతావరణ మార్పులతో పసుపు వర్ణం
రత్నాకర్‌రెడ్డి, చరిత్ర పరిశోధకుడు

వాతావరణ మార్పులతోనే రాశిగుట్టపై ఉన్న శిలల నుంచి వచ్చే పసుపు రంగు ధూళిలో కలుస్తోంది. గుట్టపైకి ఎక్కుతున్న క్రమంలో చెట్లు, రాళ్లను తాకినప్పుడు భక్తుల చేతులు, కాళ్లు పసుపు వర్ణంలోకి మారుతున్నాయి. ప్రభుత్వం రాశిగుట్టను ఎకో టూరిజం కింద అభివృద్ధి చేయాలి. రాశిగుట్టకు వెళ్లే దారి చూపే గుర్తులు ఏర్పాటు చేయాలి.



రాసిగుట్ట ప్రాంతం

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో
ఉమ్మడి జిల్లా జట్టు ప్రతిభ



ద్వితీయ స్థానం సాధించిన ఉమ్మడి జిల్లా బాలికల జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు (ఆంధ్రజ్యోతి) 4: హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 2 నుంచి 4 వరకు ఆసిఫాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్స్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి జిల్లా బాలికల జట్టు ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించింది. ఫైనల్‌లో వరంగల్ జట్టుతో తలపడి ద్వితీయ స్థానం సాధించినట్లు తెలం గాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్, ఉమ్మడి జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్‌లు తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా జట్టును డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, జనార్ధన్, ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసి డెంట్ కాసర్ల ఆనంద్ కుమార్, రమణారావు, సంయుక్త కార్యదర్శి నమిలకొం డ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్, అమర్, సాయికృష్ణ, దుర్గరాజ్, సురేం దర్, కృష్ణహరి, తదితరులు అభినందించారు.

ఓయూ రిజిస్ట్రార్‌గా రేగడిమద్దికుంట వాసి



గడ్డం నరేష్‌కు నియామకపత్రం అందజేస్తున్న వైస్ ఛాన్సలర్ కుమార్

సుల్తానాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ రిజి స్ట్రార్‌గా సుల్తానా బాద్ మండలంలోని రేగడిమద్దికుంట గ్రామానికి చెందిన గడ్డం నరేష్ నియమితలయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్‌గా నియమితులైన గడ్డం నరేష్‌కు సోమవారం యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ కుమార్ నియామకపత్రాన్ని అందజేశారు. సుల్తానాబాద్ మండంలోని రేగడి మద్దికుంట వాసి ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా నియమితులు కావడంపై గ్రామస్థులు, నరేష్ చిన్ననాటి స్నేహితులు పల్లా వాసు, మంద శ్రీనివాస్, కొమురెవల్లి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థుల సమస్యలు
పట్టించుకోని ముఖ్యమంత్రి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మణికంఠరెడ్డి

పెద్దపల్లిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలు పట్టించుకోవడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో నూతన జాతీయ విద్య విధానం అమలు చేయబోమని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. విద్యాశాఖ సీఎం వద్దే ఉంచుకొని కనీసం ఇంత వరకు ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఆనాడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో చెప్పిన మాటలకు నేడు ముఖ్యమంత్రిగా చేస్తున్న విధానాలకు పొంతన లేదన్నారు. పది సంవత్సరాల కాలంలో గత పాలకులు విద్యారంగాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించారన్నారు. వారి వైఖరి కారణంగా విద్యార్థి, యువత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవచ్చు అనే భావనతో కాంగ్రెస్ గెలుపు కోసం పని చేశారన్నారు ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక వసతులు లేక, చాల పాఠశాలలు మూత్రశాలలు, మరుగుదొడ్లు కూడా సక్రమంగా లేని పరిస్థితిలో ఉన్నాయన్నారు. సాంఘీక, సం క్షేమ, గురుకులాల ఉన్న విద్యార్థులు సమస్యలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం, మాతంగి సాగర్, శివరామకృష్ణ, శ్రీవర్ధన్, అభిరామ్, నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా
నమోదు చేసుకోవాలి

కరీంనగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల ఉపాధ్యాయ, పట్ట భద్రుల ఎమ్మెల్సీ నియోజక వర్గాలకు చెందిన వారు ఈ నెల 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నియోజకవర్గాలకు పదవీ కాలం 2025 మార్చి 29వ తేదీతో ముగుస్తుందన్నారు. ఆన్‌లైన్, ఏఈఆర్వీ కార్యాలయాల్లో నేరుగా ఓటర్లు దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. నవంబరు 23న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటిస్తామన్నారు. అభ్యంతరాలను డిసెంబరు 9 వరకు తెలియజేయ వచ్చన్నారు. డిసెంబర్ 30న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ కోసం ఫారం-18, ఉపాధ్యాయ ఎన్నికల కోసం ఫారం-19లో దరఖాస్తు చేసుకో వాలని కలెక్టర్ సూచించారు.

108లో ఉద్యోగ అవకాశాలు

సుభాష్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ మండలాల్లో గల 108 వాహనాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని జిల్లా మేనేజర్ ఇమ్రాన్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ బీజెడ్‌సీ, ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్, బీ- ఫార్మసీ, ఎం-ఫార్మసీ లేక ఇంటర్మీడి యట్‌లో బైపీసీ లేదా ఏదేని మెడికల్ డిప్లొమా చేసినవారు, 25 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల వయస్సుగల వారు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల వారు ఈనెల 6న జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని 108 కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో సంప్రదించాలని సూచించారు. వివరాలకు 9100799257 నంబరులో సంప్రదించాలని కోరారు.



కోటిలింగాల, ధర్మపురిలో గోదావరి వద్ద హారతి





ధర్మపురిలో గోదావరి నదిలో దీపాలు వదిలి పెట్టుతున్న మహిళలు

ఆలయాల్లో కార్తీక శోభ

వేములవాడ కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం కార్తీక శోభను సంతరించుకుంది. కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు రాజన్నను దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించు కున్నారు. ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. స్వామివారి దర్శనానికి సుమారు ఐదు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- కార్తీక సోమవారం సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజరాజేశ్వర స్వామితోపాటు అనుబంధ పరివార దేవతలకు అర్చనలు, అభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం చేశారు.

రాజన్న ఆలయంలో కార్తీక దీపోత్సవం

కార్తీకమాసం సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో సామూహిక కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని సోమవారం ఈవో వినోద్‌రెడ్డి ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా లత బృదంతో ఏర్పాటు చేసిన భక్తి విభావరి గానం ఆకట్టుకుంది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ కళాకారులను సన్మానించారు.

ఘనంగా మహాలింగార్చన

రాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మహాలింగార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు.

కోటిలింగాలలో గోదావరి హారతి

వెల్గటూర్: కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా మండలంలోని శైవ క్షేత్రం కోటిలింగాలలో గోదావరి హారతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మలు శ్రీ పార్వతి కోటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గోదావరి మాతకు పూజలు చేసి హారతినిచ్చారు. ప్రభుత్వ దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ ఈవో కాంతారెడ్డి తెలిపారు. కార్తీక మాసంలో పార్వతీ కోటేశ్వర స్వామి ఆలయంలో నిత్య దీపోత్సవం, కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు ప్రతీ సోమవారం గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో, ఆలయ అర్చకులు తెలిపారు. ఆలయంలో భక్తులు ఓం, స్వస్తిక్ ఆకారంలో ఆకట్టుకునేలా దీపాలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోదావరి హారతి తిలకించారు.

ధర్మపురిలో కార్తీక సందడి

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో సోమవారం కార్తీక సందడి నెలకొంది. కార్తీక మాసం సందర్భంగా భారీగా భక్తులు తరలి వచ్చారు. స్థానిక లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ రామలింగేశ్వర స్వామి, అక్కపల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. గోదావరి నదిలో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించారు. నదిలో కార్తీక దీపాలు వదిలారు. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. ఆలయం ఆవరణలో గల ఉసిరిక చెట్టు వద్ద లక్ష వత్తులు వెలిగించి, కార్తీక దామోదరుడిని పూజించారు. గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ వేదబ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య నిత్య పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఏర్పాట్లు పరిశీలించారు.

మూడో రోజు ఘనంగా గోదావరి హారతి

కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి మూడవ రోజు సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు నదీ మాతకు హారతి ఇచ్చి కార్యక్రమం నిర్వహించారు.









భక్తజనంతో కిక్కిరిసిన రాజన్న ఆలయ ప్రాంగణం, కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు, స్వామివారి దర్శనం కోసం భక్తుల క్యూ

అరుణాచల గిరి దర్శనానికి
ఆర్టీసీ బస్సు సౌకర్యం

మంథని, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణచల గిరి దర్శనానికి మంథని ప్రాంతం నుంచి వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించినట్లు డీఎం శ్రావణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న సాయంత్రం 5 గంటలకు కరీంనగర్ బస్టాండ్ నుంచి అరుణాచలం గిరికి వెళ్లే సూపర్ లగ్జరీ బస్సు సదుపాయాన్ని కల్పించామన్నారు. వెళ్లేటప్పుడు దారిలో ఉన్న కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనం, తిరుగు ప్రయాణంలో అలంపూర్ జోగులాంబ టెంపుల్ దర్శనం ఉంటుందన్నారు. ఈనెల 16న రాత్రి 12 గంటలకు బస్సు గోదావరిఖని చేరుకుంటుందన్నారు.ప్రయాణానికి పెద్దలకు రూ.4850, పిల్లలకు రూ. 4000 చార్జీ అవుతుందన్నారు. అసక్తి కలిగిన భక్తులు ఆర్. మెండయ్య సెల్ నంబర్ 9949531412ను సంప్రదించాలని సూచించారు.

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా గోదావరిఖని ఆర్టీసీ డిపో నుంచి తమిళనాడులోని అరుణాచలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సును నడిపిస్తున్నట్టు ఖని ఆర్టీసీ డిపో డీఎం నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 13న మధ్యాహ్నం 3 గంటలకు గోదావరిఖని బస్టాండ్ నుంచి బయలుదేరి మరుసటి రోజు అరుణాచలానికి చేరుకుంటుందన్నారు. ఒక్కొక్కరికి రూ.4800 చార్జి నిర్ణయించినట్టు తెలిపారు. మరింత సమాచారం కోసం 7382847316, 7382847427 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

'ఖని'లో నేడు దాశరథి, జాషువా సాహిత్య సభ

హాజరుకానున్న దేశపతి, కోటేశ్వరరావు

కోల్‌సిటీటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహాకవి దాశరథి శత జయంతి ఉత్సవాల సందర్భంగా చేతన సాహితీ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం గోదావరిఖని మార్కండేయకాలనీలోని సిద్ధార్థ హైస్కూల్‌లో దాశరథి, గుర్రం జాషువాల సాహిత్య సదస్సు జరుగనుంది. ఈ మేరకు చేతన సాహితీ సాంస్కృతిక సమాఖ్య బాధ్యులు ఎం.విజయానంద్ ఒక ప్రటనలో తెలిపారు. సాహిత్య సభకు ఎమ్మెల్సీ, గాయకుడు, కవి దేశపతి శ్రీనివాస్, హైదరాబాద్ సీటీ కళాశాల తెలుగు విభాగం డీన్ కోటేశ్వర్‌రావు హాజరవుతున్నారని పేర్కొన్నారు. దాశరథి సాహిత్యంపై దేశపతి, గుర్రం జాషువా కవిత్వంపై కోటేశ్వరరావు ప్రసంగిస్తారని తెలిపారు. కాగా సాహిత్య సభకు ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలోని సాహితీ అభిమానులు, తెలంగాణ వాదులు, సామాజిక వాదులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.



ఎస్‌యూ ఫార్మసీ కళాశాల

ఎస్‌యూ ఫార్మసీ కళాశాలను
పట్టించుకోరా..?

- **రేకుల షెడ్లలో హాస్టల్**
- **కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందిపడుతున్న విద్యార్థులు**

గణేశ్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాలలో సమస్యలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కళాశాలలో 103 మంది విద్యార్థులు ఉన్నారు. 1980లో ఫార్మసీ కళాశాలకు 42.14 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించారు. తర్వాత అందులో ఐదెకరాల భూమిని ఉర్దూ యూనివర్సిటీకి కేటాయించారు. మిగతా 37.14 ఎకరాల యూనివర్సిటీ భూమి ఎంత కబ్జాకు గురైందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రహరీ నిర్మించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. లోయర్ మానేరు డ్యాం సమీపంలో ఎస్సారెస్పీ క్వార్టర్స్‌లో హాస్టల్ నిర్వహిస్తున్నారు. రేకుల షెడ్లు కావడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిస్తే హాస్టల్ గదులు ఊరుస్తుంటాయి. కళాశాల చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. రాత్రి వేళలో బయటకు వెళ్లాలంటే విద్యార్థులు భయపడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

త్వరలో సమస్యలు పరిష్కరిస్తాం..
ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్



ఫార్మసీ కళాశాలలోని సమస్యలను త్వరలో పరిష్కరిస్తాం. రూ. 2.2 కోట్లతో ప్రహరీ నిర్మాణానికి ప్రతి పాదనలు రూపొందించాం. ఈ ప్రతిపాదనలను యూనివర్సిటీ ఎగ్జిక్యూట్ కౌన్సిల్ ముందుంచి ఆమోదం తీసుకుంటాం. 2.8 కోట్లతో అదనంగా నాలుగు తరగతి గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాం. హాస్టల్ భవనం నిర్మాణానికి నిధుల మంజూరు కోసం ప్రయత్నిస్తున్నాం.



రేకుల షెడ్లలో హాస్టల్



నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం

న్యూస్ బాక్స్

ప్రభుత్వాన్ని విమర్శిస్తే సహించం

వీర్నపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే సహించేది లేదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం విలేక రులతో మాట్లాడారు. గతంలో రైతులను విస్మరించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల విషయంలో రాష్ట్ర ప్రభు త్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు.

క్రీడా దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థి

ఇల్లంతకుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రోటరీక్లబ్ సౌజన్యంతో పూర్వ విద్యార్థి కేతి రెడ్డి రమణారెడ్డి సోమవారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. జూబ్లిహిల్స్ రోటరీక్లబ్ అధ్యక్షుడు బాలకోటిరెడ్డి, జాన్సీ, మహేందర్‌రెడ్డి, శ్యాం, రమణారెడ్డి, అమరేందర్ రెడ్డి, ఎంఈవో శ్రీనివాస్‌గౌడ్, ప్రధానోపాధ్యాయులు తిరుపతి, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

చందుర్తి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని మండల రైతు సంఘం అధ్యక్షులు, మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య అన్నారు. చందుర్తి మండల రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రామాల్లో ధాన్యం కొనుగోలు వెంటనే ప్రారంభించాలని తహసీల్దార్ శ్రీనివాస్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. మాజీ ఏఎంసీ చైర్మన్ దప్పుల అశోక్, నాయకులు అట్టపల్లి భూమయ్య, కమలాకర్‌రావు. భైరగోని రమేష్. బత్తుల కమలాకర్, మోత్కుపల్లి జలందర్, ఏరెడ్డి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 4(అంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ తెలంగాణ బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎగమంటి ఎల్లారెడ్డి డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డులో పెండి ంగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సీసీఐ కేంద్రాల్లోనే పత్తిని విక్రయించాలి

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



సీసీఐని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పత్తిని దళారులకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయిం చాలని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సంకెపల్లి, నాంపల్లి జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝూతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పత్తి రైతులు దళారులకు తమ పంటను విక్రయించవద్దని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశాలతో జిల్లాలో ఇప్పటి వరకు 200పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. తేమ శాతం సరిగ్గా ఉన్న ధాన్యాన్ని సేకరిస్తున్నామని, ధాన్యం నిల్వలకు సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని అపెరల్ పార్క్ వద్ద గోదాములను పరిశీలించామని అన్నారు. జిల్లాలో పత్తిని పండించిన రైతులు 8 నుంచి 12 శాతం తేమతో తమ పరిధిలోని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తరలించి విక్రయించాలని సూచించారు. నాణ్యమైన పత్తి క్వింటాల్‌కు రూ.7,521, 8 నుంచి 12 శాతం లోపు తేమ పత్తికి రూ.7,200 నుంచి రూ.7,445 చొప్పున సీసీఐ మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాశ్ జిన్నింగ్ మిల్లు నిర్వహకులు నీలం శ్రీనివాస్, రాజిరెడ్డి నాంపల్లి సింగిల్ విండో చైర్మన్ బీరెడ్డి సల్మాన్‌రెడ్డి, కౌన్సిలర్ నీలం కళ్యాణిశేఖర్ డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.

కోనరావుపేట : పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని, రైతును రాజుగా చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం సుద్దాలలోని కావేరి మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పత్తి రైతులు దళారులకు తమ పంటను విక్రయించవద్దని సూచించారు. ఇల్లంతకుంట మండ లంలో సీసీఐ ఆధ్వర్యంలో రెండు పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. ఈ సీజన్ ముగిసిన తర్వాత రైతుల పొలాలలో మట్టి పరీక్షలు చేయించి దానికి అనుగుణంగా విత్తనాలు ఎంపిక, ఎరువుల వాడకంపై అవగాహన కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, కచ్చకాయల ఎల్లయ్య, బాల్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, గొట్టె రుక్మిణి, గోపాల్, బాపురెడ్డి, కాశవేణి మహేష్, గణేష్, ఉప్పుల గంగయ్య, నాయిని ప్రభాకర్ రెడ్డి, బాదనేని బాల్ రాజు, సంజీవ్, సురేష్, సుంకరి పరుశరాములు, రెడ్డి, దేవయ్య, రమేష్, మహేష్, రమేష్, నాగిరెడ్డి తహసీల్దార్ విజయ ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు



పోలీస్ స్టేషన్‌లో మాజీ సర్పంచులు

ఇల్లంతకుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) ఇల్లంతకుంట మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచులు సోమవారం చలో హైదరాబాద్ చేపట్టగా ఉదయమే పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా తాజా మాజీ సర్పంచులు మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందాలని అప్పులు చేసి పనులు చేస్తే ఇంతవరకు తమకు బిల్లులు రాలేదన్నారు. ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచులు చల్ల నారాయణ, గట్ల మల్లారెడ్డి, చింతలపెల్లి తిరుపతిరెడ్డి, వాణిదేవేందర్‌రెడ్డి, బాగ్యలక్ష్మిబాలరాజు, వెంకన్న ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, సర్పంచుల భర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సోమవారం సాయంత్రం వదిలి పెట్టారు. మాజీ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, తాజా, మాజీ సర్పంచులు రవీందర్, శంకర్, ప్రభునాయక్, శంకర్‌నాయక్ ఉన్నారు.

తంగళ్లపల్లి: మండలానికి చెందిన మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. హైదరాబాదులో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాట్ల మధుతోపాటు నాయకులను అదుపులోకి తీసుకున్నారు. మాజీ సర్పంచులు వలకొండ వేణుగోపాలరావు, గనప శివజ్యోతి, జక్కుల రవీందర్, నరసయ్య, కాయితి బాలయ్యను పోలీస్ స్టేషన్ తరలించారు.

● పెండింగ్ బిల్లులు కావాలని కోరుతున్న మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేయడం హేయమైన చర్య అని బీజేపీ మండల కన్వీనర్ దెశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు.

చందుర్తి: పెండింగ్ బిల్లులను చెల్లించాలని చలో హైదరాబాద్ పోరుబాట కార్యక్రమానికి తాజా మాజి సర్పంచ్‌లు ఇచ్చిన పిలుపుమేరకు వెళ్తున్న తాజా మాజీ సర్పంచులను, సర్పంచ్‌ల భర్తలను పోలీసులు సోమవారం అరెస్టు చేసి, సొంత పూచికత్తుపై విడుదల చేశారు. మాజీ సర్పంచులు లింగంపల్లి కరుణాకర్, మ్యాకల పర్శరాములు, కమలాకర్ రావు ఉన్నారు.

వీర్నపల్లి: ముందస్తు అరెస్టులపై వీర్నపల్లి మండల మాజీ సర్పంచులు మండిపడ్డారు. పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని పోరాటం చేస్తున్న పట్టించుకోవడం లేదన్నారు.

మెస్, కాస్మోటిక్స్ చార్జీల పెంపుపై హర్షం

సిరిసిల్ల టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల మెస్, కాస్మోటిక్స్ చార్జీల పెంపుపై జాతీయ బీసీ సంక్షేమ సంఘం (ఆర్.కృష్ణయ్య) జిల్లా అధ్యక్షుడు మ్యాకల పర్శరాములు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. జిల్లా పూర్తి కార్యవర్గ సభ్యుల నియామకం చేపటాటరు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బిల్లా వెంకట్రాములు, ప్రధాన కార్యదర్శి భైరగోని గోపి, కార్యదర్శి ఎడ్ల నరేందర్‌కు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని గురుకుల, సంక్షేమ వసతి గృహాలోని 7,65,705 మంది విద్యార్థులకు పెంచిన మెస్, కాస్మోటిక్స్ చార్జీలతో ప్రయోజన చేకూరుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణను స్వాగతిస్తున్నామన్నారు. కులగణన తర్వాత బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా పార్లమెంట్ సమావేశంలో బీసీ బిల్ పెట్టి ఆమోదింప జేసి చట్ట సభలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు లోకం వెంకటేష్, మహేష్, జక్కని చిరంజీవి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

ఇల్లంతకుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులు అధైర్య పడవద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని ఏఎంసీ చైర్ పర్సన్ ఐరెడ్డి చైతన్య మహేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం పరిశీలించారు. కేంద్రాలలో ధాన్యం సేకరణ ప్రారంభమైందని, కావాలని కొంతమంది నాయకులు రైతులను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. వైస్ చైర్మన్ ప్రసాద్, డైరెక్టర్లు తాట్ల వీరేశం, మచ్చ రాజేశం, ఐరెడ్డి సురేందర్‌రెడ్డి, కొమ్ము నర్సింగం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటులో లోపాలను సవరించాలి



వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

వేములవాడ రూరల్/చందుర్తి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సర్దుబాటులో లోపాలను సవరించాలని ఉపాధ్యాయ ఐక్య కార్యచరణ వేదిక నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఎమ్మార్వో ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కలెక్టర్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ అసంబద్ధంగా ఉందని, జీవో నంబరు 25కి విరుద్ధంగా చేపట్టడంతో జిల్లా వ్యాప్తంగా చాలామంది ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందని అన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌తోపాటు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు విన్నవించినట్లు చెప్పారు. ఉపాధ్యాయ ఐక్య వేదిక సమన్వయ కర్తలు ఎడ్ల కిషన్, వంగ తిరుపతి, కటుకూరి ముఖేష్, ఎడ్ల కృష్ణచైతన్య, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల అక్రమ సర్దుబాటును సవరిం చాలని ఉపాధ్యాయ జేఏసీ జిల్లా కో కన్వీనర్ విక్కుర్తి లక్ష్మి నారాయణ అన్నారు. సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఎమ్మార్వో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం వేములవాడ, రూరల్ ఎంఈవోలకు వినతిపత్రం అందజేశారు.

వీర్నపల్లి : జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ జీవో నెంబర్ 25కు విరుద్ధంగా జరిగిందని ప్రభుత్వ ఉపాధ్యాయులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు శ్రీనివాస్, గజన్, ప్రేమ్ సాగర్, బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్ల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేసున్న రైస్ మిల్లర్లు

సిరిసిల్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం వద్దకు వెళ్లే క్రమంలో ముందస్తు అరెస్ట్‌ల సరికాదని రైస్ మిల్లర్లు నిరసనల తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ వద్ద జిల్లా రా రైస్‌మిల్లర్ల ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని నిరసించారు. మిల్లింగ్ చార్జీలు ఇతర రాష్ట్రాల్లో రూ.120 నుంచి 220 వరకు ఉంటే తెలంగాణలో రూ.10 నుంచి రూ.27 వరకే ఉన్నాయని అన్నారు. మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. రా రైస్‌మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు పబ్బ నాగరాజు, ప్రధాన కార్యదర్శి సందుపట్ల రాజిరెడ్డి, రాష్ట్ర సలహాదారుడు గరిపెల్లి ప్రభాకర్, చేపూరి శ్రీనివాస్, నగునూరి శ్రీకాంత్, గౌరిశెట్టి భాస్కర్, అంజనేయులు, సత్యం రావు, సామల మల్లేశం పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించే విధంగా ఒత్తిడి తేవాలి

సిరిసిల్ల టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఎస్ఐ, మ్యాక్స్ సంఘాలను ఆసాములు ఎవరి వద్దనైతే నడిపారో వారినే కరెంటి బిల్లులు చెల్లించే విధంగా ఒత్తిడి తీసుకురావాలని చేనేత, పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో చేనేత, పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశంలో రవి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలను చెల్లించి పరిశ్రమను ప్రారంభించి కార్మికులకు ఉపాధి చూపించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. చేనేత, పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రమౌళి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఎల్లారెడ్డిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రిన్సిపాల్ వనజ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై సోమవారం అవగాహన కల్పించారు. పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.

కమ్యూనిటీ భవనానికి భూమిపూజ

ఇల్లంతకుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందికట్కూర్ గ్రామంలో మాల కమ్యూనిటీ భవనానికి మాజీ సర్పంచ్ ముత్యం అమర్‌గౌడ్ సోమవారం భూమిపూజ చేశారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్య నారాయణ రూ.4 లక్షలు మంజూరు చేశారు. ఏఈ అజారుద్దీన్ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

వేములవాడ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, తాలు, తప్ప, తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని బీజేపీ పట్టణ అధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు అన్నారు. సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు వరి కోతలు మొదలుపెట్టి దాదాపు నెల రోజులు అవుతోందని, ధాన్యం కొనుగోలు కేంద్రాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని అన్నారు. వాతావరణ పరిస్థితులతో రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దొడ్డు, సన్న వడ్లకు రూ. 500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు హన్మాండ్లు, రాజ్‌కుమార్, సగ్గు రాహుల్, మనోజ్, నామాల శేఖర్, బిల్లా కృష్ణహరి, మామిళ్ల లక్ష్మీరాజం, నగేష్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వంపై నమ్మకం లేకనే ధాన్యం దళారులకు విక్రయం



సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

ఇల్లంతకుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రప్రభుత్వంపై నమ్మకం లేకనే విధిలేని పరిస్థితుల్లో రైతులు దళారులకు ధాన్యాన్ని విక్రయిస్తున్నారని మాజీ జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహరెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో సోమవారం రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్భాటంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందని, ఇంతవరకు ధాన్యాన్ని సేకరించలేదని అన్నారు. గత ప్రభుత్వంలో ఏనాడూ ఇలాంటి పరిస్థితి రాలేదన్నారు. రైతు భరోసా ఇస్తామని కాంగ్రెస్ నాయకులు చేసిన వాగ్దానం ఇంతవరకు నెరవేరలేదన్నారు. రాష్ట్రంలో రైతు వ్యతిరేక ప్రభుత్వం నడుస్తుందని, ప్రభుత్వంపై అన్నివర్గాల ప్రజలలో తీవ్ర అసంతృప్తి ఉందని అన్నారు. సెస్‌డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి, నాయకులు సాదుల్, ఎంఢ్ర చందన్, కూనబోయిన రఘు, దొంతుల శంకర్, అంతగిరి భాస్కర్, సలీం, అవారి బాబు, పర్శరాం, మహేష్, పత్రి అంజయ్య, నవీన్ పాల్గొన్నారు.

షెడ్లను సెస్, ధాన్యం నిల్వలకు కేటాయించవద్దు

సిరిసిల్ల రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం నిర్మించిన వర్కర్ టు ఓనర్ షెడ్లను సెస్, ధాన్యం నిల్వల కోసం కేటాయించవద్దని, బతుకమ్మ చీరలను తయారు చేసిన మరమగ్గాల కార్మికులకు రావాల్సిన 10 శాతం యారన్ సబ్సిడీ విడుదల చేయాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని చేనేత జౌళిశాఖ కార్యాలయం ఎదుట సోమవారం సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీఆధ్వర్యంలో ధర్నా చేశారు ఈ సందర్భంగా మూషం రమేష్ మాట్లాడుతూ కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు చేసిన పోరాటాల ఫలితంగా వర్కర్ టు ఓనర్ పథకాన్ని గత ప్రభుత్వం మంజూరు చేసిందని, పెద్దూర్ శివారులో వీవింగ్ పార్కును ఏర్పాటు చేసి షెడ్లను పూర్తి చేసిందని అన్నారు. అనంతరం అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్లె సత్యం తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

సర్వే షెడ్యూల్‌లో స్వల్ప మార్పు

5వపేజీ తరువాయి..

మాత్రమే ఎన్యూమరేట ర్లుగా నియమించారు. ప్రభుత్వం తాజాగా సర్వేకు ఉపాధ్యాయులను నియమించింది. కేటాయించిన ఉపాధ్యాయులకు రెండో విడత శిక్షణ ఇవ్వనున్నారు. సర్వేలో ఇప్పటికే నియమించిన ఎన్యూమరేటర్లలో ఇబ్బందులు పడుతున్న వారి స్థానంలో ఉపాధ్యాయులను నియమించనున్నట్లు తెలిసింది.

తొలిసారి బీసీ గణన

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో తొలిసారిగా బీసీ గణన జరుగుతోంది. గత ప్రభుత్వం 2014లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో 1.77 లక్షల కుటుంబాలను సర్వే చేయగా అందులో ఎస్సీలు 1,13,870 జనాభా ఉండగా ఎస్టీలు 26,346 మంది, బీసీలు 3,56,977 మంది, మైనార్టీలు 27,349 మంది, ఓసీలు 71,116 మంది ఉన్నట్లు గుర్తించారు. ఈ సారి బీసీ కులగణనే ప్రధానంగా దృష్టి సారించారు. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల ప్రక్రియ కూడా చేపట్టనున్నారు. ఇప్పటివరకు బీసీ జనాభాపై స్పష్టత లేకపోవడంతో ఆ సామాజిక వర్గాల్లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది.

75 ప్రశ్నలతో సర్వే

ప్రతీ ఇంటింటికి వెళ్లి సర్వే చేయడానికి దాదాపు 56 అంశాలు, 75 ప్రశ్నలతో ప్రశ్నాపత్రాన్ని రూపొందించారు. ప్రశ్నాపత్రం అధికారికంగా ఇంకా వెలువడకపోయినా అంశాలపై చర్చ మాత్రం సాగుతోంది. కుటుంబాల యజమాని వివరాలతో పాటు రాజకీయ నేపథ్యం, కుటుంబ సభ్యుల ఆస్తులు, అప్పులు, పశు సంపద, ప్రభుత్వం నుంచి అందుకున్న రుణాలు, ప్రభుత్వం, ప్రైవేటు ఉద్యోగుల వివరాలు, కుటుంబ సభ్యుల్లో రిజర్వేషన్లు ఉపయోగించుకున్న వారి వివరాలు, భూములు, వాహనాలు, ఇతర దేశాలకు ఉద్యోగాల కోసం వెళ్లిన వారి వివరాలు, ఇన్‌కంట్యాక్స్ కడుతున్న వారు ఇలా అనేక అంశాలతో వివరాలు సేకరించనున్నారు.

కాంగ్రెస్ భాగస్వామ్యం

సమగ్ర ఇంటింటి కుటుంబసర్వేలో అధికార కాంగ్రెస్ శ్రేణులు భాగస్వామ్యం అయ్యే విధంగా నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశం కూడా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మార్గనిర్దేశనం చేశారు. మున్సిపల్, గ్రామ, మండల స్థాయిలో ఉన్న నాయకులు కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులు సర్వేలో భాగస్వామ్యం కావాలని సూచనలు చేశారు.

ఏకమవుతున్న కుల సంఘాలు

బీసీ కులగణన సమర్థవంతంగా, పారదర్శకంగా ఉండే విధంగా నిత్యం పర్యవేక్షించడానికి కుల సంఘాలు ఏకమవుతున్నాయి. ఇప్పటికే బీసీ కుల సంఘాలు కులగణనలో తమవంతుగా భాగస్వామ్యం కావాలని నిర్ణయించాయి. జిల్లాలో పద్మశాలీలతో పాటు ఇతర బీసీ సామాజిక వర్గాలు ఎక్కువగా ఉండడంతో విద్యావంతులు, కుల సంఘాల పెద్దలు సమావేశమై నమోదు ప్రక్రియపై నిఘా ఉంచనున్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

ఇల్లంతకుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ దేశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రాలలో ధాన్యం పోసి నెలరోజులు గడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వర్షాలు పడే అవకాశం ఉందని భావిస్తున్న రైతులు నష్టపోతు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారని, రైతులు నష్టపోవడానికి ప్రభుత్వ వైఫల్యమే కారణమని అన్నారు. కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు చింతలపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రైతులపై బీఆర్ఎస్, బీజేపీ మొసలి కన్నీరు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పదేళ్లలో రైతులను పట్టించుకోని బీఆర్ఎస్, కేంద్రంలోని బీజేపీ రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నాయని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతుల సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్ఎస్, బీజేపీ ఆందోళన చేయడం సిగ్గు చేటన్నారు. ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తయిన తర్వాత బీఆర్ఎస్, బీజేపీ ధర్నా చేయడం చౌకబారు రాజకీయాలకు నిదర్శనమన్నారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నాయకులు గౌస్, లింగాగౌడ్, గిరిధర్‌రెడ్డి, మల్లారెడ్డి, గంగయ్య, రాంరెడ్డి, శ్రీనివాస్, దేవానందం, రవీందర్, తిరుపతిరెడ్డి, నారాయణరెడ్డి, రామచంద్రం, రాజునాయక్, రవి, రాములు, బాల్‌రెడ్డి, నాగరాజు, ఎల్లయ్య, పద్మారెడ్డి, కిషన్, మహేందర్, నిజాం, చందు తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ హైవే 365 బీ రోడ్డు అలైన్మెంట్ మార్చాలి

సిరిసిల్ల టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణ శివారులో నేషనల్ హైవే 365 బీ రోడ్డు అలైన్మెంట్‌ను మార్చాలని భూనిర్వాసితులు కోరారు. సోమవారం కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భూనిర్వాసితులు మాట్లాడుతూ గతంలో మొదటి బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం విలువైన భూములను కోల్పోయామని, రెండోసారి విలువైన తమ భూములను కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు, భూనిర్వాసితులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపి వేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 4 (అంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని 7వ వార్డు సాయినగర్‌లో ఇళ్ల మధ్యలో సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయించాలని కాలనీ వాసులు సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చి ఆందోళన చేపట్టారు. ఇళ్ల మధ్యలో సెల్‌టవర్ ఏర్పాటు చేస్తే అనారోగ్య సమస్యలు వస్తాయని పనులను నిలిపివేయాలని కోరినా పట్టించుకోవడం లేదని కాలనీకి చెందిన వార్డు కౌన్సిలర్ భూక్య రెడ్డి నాయక్‌తోపాటు కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కిషోర్‌కుమార్, దూస సాయి, వెంకన్న, వాణి, లక్ష్మి, వసంత తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం సిద్ధం

తంగళ్లపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ అన్నారు. సోమవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు చేయడం లేదని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తంగళ్లపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో ఐకేపీ, ప్యాక్స్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లా నాయకులు లింగాల భూపతి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు నెరెల్ల నర్సింగం గౌడ్, డైరెక్టర్లు పొన్నాల పరుశురాం, అరేపల్లి బాలు, మాజీ సర్పంచ్ పొన్నం లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ భైరనేని రాము పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ఆరోపణలు మానుకోవాలి

గంభీరావుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు అబద్ధపు ఆరోపణలు మానుకోవాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ అన్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. కొందరు బీఆర్ఎస్ నాయకులు రైస్ మిల్లర్లతో కుమ్మక్కై రైతులను ఇబ్బందులకు గురిచేసే విధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. ముందుగానే గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే, కొందరు బీఆర్ఎస్ నాయకులు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, కార్యదర్శి రామచంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు రాజు, సోషల్ మీడియా కన్వీనర్ గౌరిశంకర్ ఉన్నారు.

రాష్ట్ర బీసీ సంఘం నేతకు పితృ వియోగం

గంభీరావుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు తండ్రి నర్సయ్య సోమవారం అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి చెందారు. నర్సయ్య మృత దేహాన్ని స్వగ్రామమైన గంభీరావుపేట మండలంలోని శ్రీగాధకు తీసుకొచ్చారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, సెస్ డైరెక్టర్ నారాయణరావు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, పార్టీల నాయకులు ఎగదండి స్వామి, ఎడబోయిన రాజు, హరీష్, రాజేందర్, మల్లేశం సంతాపం తెలిపారు.